RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 4, సంచిక : 10 | గురువారం డిసెంబర్ 11, 2025 | పేజీలు : 6 వెల : రూ.3-00

దినపత్రిక



3లో..

**పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు**



- ఎదగాలన్నది నా సంకల్పం: సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.వెయ్యి కోట్ల మంజూరు ఉత్తర్వులు విడుదల
- వర్సిటీకి 108 సంవత్సరాల పురాతన చరిత్ర

# ప్రపంచానికి దిక్సూచిలా 'ఓయూ'

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఉద్యమ కాలంలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు ఆకాంక్షించిన స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గత వైభవం తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల మంజూరు చేస్తూ జారీ అయిన ఉత్తర్వులను విడుదల చేశారు.

**– అత్యంత పురాతన వర్సిటీల్లో ఒకటి..**

విశ్వవిద్యాలయ అభివృద్ధికి సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను విద్యార్థుల సూచనల కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 108 సంవత్స రాల చరిత్ర కలిగి దేశంలోనే అత్యంత పురాతన యూనివర్సిటీల్లో 7 వ స్థానం, దక్షిణ భారత దేశంలో 3 వ ప్రాధాన్యత కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ అలనాటి స్ఫూర్తితో భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించు కునే క్రమంలో అందరినీ కలవాలని వచ్చానని చెప్పా రు. "గుండె నిండా అభిమానంతో యూనివర్సిటీకి వచ్చా. ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి విశ్వవిద్యాలయ అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు రచించడానికి వచ్చాను. ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఇక్కడికి



మిగతా 3వ పేజీలో..

# ఆటో కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది




**– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేసే ఆత్మీయ భరోసా కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ఆటో డ్రైవర్లు హాజరైన ఈ కార్యక్రమంలో, ఆటోడ్రైవర్ సమాజం కోసం బీఆర్ఎస్ కట్టుబాటు కొనసాగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఉద్యమకాలంలో కేసీఆర్ దీక్ష సమయంలో ముందుండి పోరాడిన వర్గాలలో ఆటో డ్రైవర్లు ముఖ్యులు. కార్మిక పక్షపాతి నాయకుడు కేసీఆర్ రైతులకు, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు. ఆయన చేసిన సంక్షేమాన్ని ఇప్పటికీ ప్రజలు గుర్తుంచుకుంటున్నారు" అని అన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కేటీఆర్, "రెండేళ్లలో మార్పు మార్పు అంటూ ఎలా మోసం చేస్తారో అందరికీ అర్థమైంది. రాహుల్ గాంధీ మగ్రష్ అలీ ఆటోలో ఎక్కి ఇచ్చిన హామీలు ఏమైయ్యాయో చూడండి అలీ ఈ రోజుకి రెండు ఆటోలు అమ్ముకుని కిరాయి ఆటో నడుపు

మిగతా 3వ పేజీలో..

# పార్లమెంటులో అమిత్ షా - రాహుల్ మధ్య ఘర్షణ



**న్యూఢిల్లీ, వేద న్యూస్:**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బుధవారం లోక్‌సభ వేడెక్కింది. ఎన్నికల సంస్కరణల చర్చలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి చర్చ జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయగా, తన ప్రసంగాన్ని ఎవరూ నియంత్రించలేరని అమిత్ షా హెచ్చరించారు. అమిత్ షా మాట్లాడుతూ ఓటర్ల జాబితా నవీకరణ, అర్హత కలిగిన ఓటర్లను ఖచ్చితంగా గుర్తించడం లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జరుగుతోందని తెలిపారు. అయితే ప్రతిపక్షాలు దీనిపైనా అభ్యంతరాలు వ్యక్తం చేయడం విచిత్రమని వ్యాఖ్యానించారు. "మీరు గెలిస్తే జాబితాలు సరైనవే అంటారు%ౌ% మీరు ఓడితే అవి తప్పుగా ఉన్నాయంటారు. ఇది ద్వంద్వ వైఖరి" అని ఎగతాళి చేశారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓటర్ల జాబితా అవకతవకలపై చేసిన మీడియా సమావేశాలు, 'ఓటు చోరీ' ని హైడ్రోజన్ బాంబుతో పోల్చడం వంటి వ్యాఖ్యలపై అమిత్ షా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా అపవాదం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు ప్రజల్లో భ్రమలు సృష్టించే ప్రయత్నమని షా అభిప్రాయపడ్డారువాగ్వాదం తారాస్థాయికి చేరిన సమయంలో అమిత్ షా పరోక్షంగా నెహ్రూ, ఇందిరా గాంధీ కుటుంబాలను ఉద్దేశిస్తూ "కొన్ని కుటుంబాలు తరతరాలుగా ఓటు దొంగలు" అని విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో సభలో ఉద్రిక్తత మరింత పెరిగింది. పలువురు సభ్యులు ఆగ్రహంతో స్పందించగా, సభ తాత్కాలికంగా కోలాహలంతో నిండిపోయింది.

# తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండగా.. తొలి దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 11, గురువారం (నేడు)జరగనుంది. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి విడత ప్రచారానికి గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. పోలింగ్ కోసం ఇప్పటికే మండల కేంద్రాలకు బ్యాలెట్ పేపర్లు, బాక్సులు పంపించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. మూడు విడతల్లో జరిగే స్థానిక పంచాయతీ ఎన్నికల కోసం మొత్తం 10 వేలకు పైగా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు. తొలి విడతలో 3 వేలకు పైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించాలి. ఎన్నికల పోలింగ్ పూర్తయిన వెంటనే కౌంటింగ్ మొదలు పెట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. ముందు సర్పంచ్, వార్డు మెంబర్లను ప్రకటించాలి. ఆ తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ చేపట్టాలన్నారు. అయితే ఈసారి గ్రీన్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈసీ తెలిపింది. ఇదిలా ఉంటే పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రేవంత్ సర్కార్.. రూ.175 కోట్లు కేటాయించింది. దీనిలో ఇప్పటి వరకు రూ.100 కోట్ల మేర నిధులు మంజూరు అయ్యాయి. ఈ మొత్తాన్ని ఇప్పటికే జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ ఆఫీసర్ల ఖాతాల్లో జమ చేశారు. అలానే పోలింగ్ కేంద్రాల వారీగా ఎంపీడీవోల ఖాతాల్లో కూడా నిధులు జమ అయ్యాయి. మిగిలిన రూ.75 కోట్లను కూడా ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేస్తారని అధికారులు తెలిపారు. అయితే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఈ నిధులు సరిపోవని.. మరో రూ.50 కోట్ల వరకు అవసరం ఉంటుందని.. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని తెలుస్తోంది. మొదటి విడతలో మొత్తం 37,440 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 149 చోట్ల నామినేషన్లు వేయలేదు. వార్డుల్లోనూ రికార్డు స్థాయిలో 9,331 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 27,960 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. వార్డులకు 67,893 మంది బరిలో ఉండడం గమనార్హం.




# విలీనమే శాశ్వత పరిష్కారం..!

- రామన్న చెరువు సమస్యపై కవిత ఆవేదన
- కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలంటూ డిమాండ్
- చెరువు పొంగిపొర్లి కాలనీలు మునుగుతున్నాయని ఆందోళన
- సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కవిత హామీ

3లో..



# పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ రాష్ట్రం

## – బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్




**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయిన నేపథ్యంలో డబుల్ రైజింగ్‌కు అంచనాలకు మించి ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు రావడం రెండు సంవత్సరాల ప్రజాపాలన ప్రభుత్వానికి నిదర్శనమని రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా డబల్ బోనంజా తేవడం పట్ల బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, తెలంగాణ ప్రజల గీత, రాత మార్చేందుకు ప్రజా పాలన ప్రజల పాలిటి ఇలవేల్పుగా మిగిలిందని అన్నారు. సాంకేతికత ఆవిష్కరణ, సమర్థ ఆర్థిక నిర్వహణ, సుపరిపాలన ఈ మూడు ఉత్ప్రేరకాలే మూడంచల వ్యూహాలకు ఊతమిచ్చాయని క్యూర్, ప్యూర్, రేర్ తో పాటు పది కీలక వ్యూహాలతో రోడ్డు మ్యాప్ రూపొందించడం రాష్ట్ర ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించేందుకు రూపొందించిన డాక్యుమెంట్లు సహకరిస్తాయని అన్నారు. రెండు సంవత్సరాల రేవంత్ రెడ్డి పాలనలో గత పది సంవత్సరాలుగా పరిపాలించిన నాయకులపై ఒక్క విమర్శ కూడా చేయకుండా తన పరిణతి ప్రదర్శించారని ప్రశంసించారు. అధికారమిచ్చిన పేద ప్రజలకు న్యాయం చేయాలన్న నిబద్ధత, జపాన్, దక్షిణ కొరియా తరహాలో సినీ గ్లోబల్ హబ్ గా హైదరాబాదు మార్చడం లాంటి డాక్యుమెంట్ల నిర్వహణ ప్రజా పాలన ప్రభుత్వానికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలన రెండు సంవత్సరాల లో గత పది సంవత్సరాల లో జరగని అభివృద్ధిని చవి చూసింద ని, మరింత అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళుతుందని, ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వేరు మంత్రులు వేరు అని కాకుండా అందరి సమన్వయంతో రాష్ట్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతుంది అనడంలో అతిశ యోక్తి లేదు అని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకోండి

## – మాజీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్



**వేద న్యూస్, చొప్పదండి :**

నేడు జరగబోయే చొప్పదండి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీతో సంబంధం ఉన్న ప్రజా ప్రతినిధులను కార్యకర్తలను మాత్రమే సర్పంచులుగా ప్రజలు ఎన్నుకుంటే గ్రామాల్లో పనులకు నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అండతో తీసుకురాగలుగుతారు. అంతే కాకుండా అభివృద్ధికి తోడ్పడతారు. ప్రజలంతా ఆలోచించి మీ అమూల్యమైన ఓటు సర్పంచ్ గా, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు వేసి గెలిపించాలని చొప్పదండి మాజీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్ పిలుపునిచ్చారు.

# నీ ఓటు, నీ గ్రామ అభివృద్ధి కోసం

## – సామాజిక సేవకుడు గొల్లపెల్లి నరేష్




**వేద న్యూస్, చొప్పదండి :**

మన భారత దేశం రాజ్యాంగంలో ఆర్టికల్ 326 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 ద్వారా కల్పించబడిన రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు. ప్రతి ఐదేళ్లకు ఒకేసారి వచ్చే ఈ ఓటు అనే వజ్రాయుధం ద్వారా సమర్థవంతమైన నాయకుణ్ణి ఎన్ను కొని సమ సమాజ నిర్మాణంలో మన వంతు పాత్ర పోషించవచ్చుని, ఓటు హక్కును వినియోగించినపుడే గ్రామ ప్రజా ప్రతినిధులను ప్రశ్నించే హక్కు ఉంటుందని సామాజిక సేవకుడు గొల్లపెల్లి నరేష్ అన్నారు. అంతే కాకుండా డబ్బుకు, మద్యానికి మీ విలువైన ఓటు అమ్ముకోకూడదు. ఉపాధి కోసం ఎక్కడ ఎక్కడ ఉన్న ఓటింగ్ రోజు మాత్రం ఓటు హక్కుని మీ నిర్దేశిక గ్రామంలో వినియోగించుకోవాలన్నారు. ఓటు అనేది హక్కు మాత్రమే కాదు మన బాధ్యత. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఓటుహక్కును వినియోగించుకుని, తమ ప్రాంత అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సామాజిక సేవకులు నరేష్ తెలియజేశారు.

# ఎంపీడీఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్,వీర్నపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. వీర్నపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో 12న ఇండక్షన్ ప్రోగ్రాం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ అద్యక్షతన పి.జి 2025. 2026 విద్యా సంవత్సరంలోని మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాంను డిసెంబర్ 12వ తేది శుక్రవారం నాడు ఉదయం 10.00 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాలలో ప్రవేశాలు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

# శివకుమార్ కుటుంబానికి ట్రస్మా అండ



**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలం సోమగూడెం(కే) గ్రామానికి చెందిన అక్షర స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ ఆకస్మిక మరణం జిల్లాలో విద్యావేత్తల వర్గాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ క్రమంలో ట్రాస్మా – తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్, మంచిర్యాల జిల్లా తరపున ఆయన కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచింది. ట్రాస్మా జిల్లా నాయకులు సేకరించిన రూ. 1,75,000 మొత్తాన్ని శివకుమార్ కుటుంబానికి అందజేశారు. ఇందులో రూ. 1,50,000 ను ఆయన కుమార్తె పేరు మీద ఎల్ఐసి ఫిక్స్ బాండ్ రూపంలో భవిష్యత్తు భద్రత కోసం జమ చేయగా, మిగిలిన రూ. 25,000 ను వారి తక్షణ అవసరాల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు హాజరై శివకుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పిల్లల విద్య విషయంలో వారు ఎక్కడ చదువుకున్నా జిల్లా ట్రస్మా పూర్తి సహకారం అందిస్తుందని నాయకులు హామీ ఇచ్చారు. పిల్లలకి భవిష్యత్ లో ఎలాంటి కష్టమొచ్చిన ట్రస్మా అండగా నిలబడతుందని ఆ కుటుంబానికి పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ సతిమణి భావోద్వేగానికి లోనై ట్రస్మా నాయకులందరికీ తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్ధన్ రావు, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు కొమ్ము దుర్గాప్రసాద్, మందమర్రి మండల అధ్యక్షులు పెద్దపల్లి ఉప్పలయ్య, కాసిపేట మండల,అధ్యక్షులు ఎస్. చంద్ర శేఖర్,ట్రస్మా నాయకులు ఉస్మాన్ పాషా, వై కరుణాకర్ రెడ్డి, లడ్డూరి రమేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# రెండేండ్లలో రూ.20 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ మరో రికార్డు సృష్టించారు. ఆపదలో తన ఇంటికి వచ్చిన వారికి అన్ని విధాల సాయం చేయడంతో పాటు పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ నిధులు ఇప్పిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. గత రెండేళ్లలోనే రూ. 20 కోట్ల సీఎం అఫ్ చెక్కులను తన నియోజకవర్గ ప్రజానీకానికి అందించి సరికొత్త హిస్టరీ సృష్టించారు. తమకు అండగా నిలుస్తున్న కొండా సురేఖ పట్ల వరంగల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సృష్టించడం జరిగింది. సీఎంఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో రూ. 1.685.79 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయగా ఏడాదికి సగటున రూ. 850 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించడం జరిగింది. అయితే తన జిల్లా, నియోజకవర్గంకి సంబంధించి 2024లో 663 చెక్కులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు రూ. 3, 03,28,000 అందజేశారు. 2025లో 4,668 చెక్కులు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు రూ. 17,37,57,890 అందజేయడం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది.

# కేయూ లో ముగిసిన నోబెల్ ప్రైస్ డే సెలబ్రేషన్స్

## – శాస్త్రవేత్తలే సమాజ మార్గదర్శకులు
## – ఆచార్య వల్లూరి రామచంద్రం కేయూ రిజిస్ట్రార్



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆధ్వర్యంలో డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల నోబెల్ ప్రైజ్ డే సంబరాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థుల అకాడమిక్ స్పిరిట్ ఎంతో గొప్పదని అన్నారు. ప్రతి ఆవిష్కరణ, సృజన మానవ అభివృద్ధికి దారితీయాలని, విద్యార్థుల జిజ్ఞాసను బహిర్గతం చేయడం ద్వారా ప్రపంచ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. విద్యార్థుల మేధస్సే పవర్ ఆఫ్ ఐడియాస్ కు పునాదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ సందర్భంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమ నిర్వహణలో అధ్యాపకుల కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారీ మాట్లాడుతూ, మొత్తం 11 విభాగాల నుండి 300 పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్ నిర్వహించడానికి విద్యార్థులతోనే కమిటీ వేసి వారే నిర్వహించేలా చేశామని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి దోహదపడ్డ ఆయా విభాగాల అధిపతులకు, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. పరిశోధనతోనే దేశం పురోగతి సాధిస్తుందన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ, ఆవిష్కరణలు ప్రమాణాలకు అనుగుణంగా, మానవ అవసరాలను తీర్చే దిశగా ఉండాలని సూచించారు. ఫార్మసీ విభాగ డీన్ ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ, పాండెమిక్ సమయంలో భారత్ ప్రపంచానికి వ్యాక్సిన్లు అందించిన మహత్తర పాత్రను వివరించారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్సలర్ ఆచార్య మహమ్మద్ ఇక్బాల్ అలీ మాట్లాడుతూ, భారతదేశం అనేకమంది నోబెల్ శాస్త్రవేత్తలను ప్రపంచానికి అందించడంతో పాటు కౌటిల్య వంటి మహనీయులను సృష్టించిన భూమి అని పేర్కొన్నారు. వరంగల్ ఎన్ఐటీకి చెందిన ఆచార్య రాజ విశ్వనాథం మాట్లాడుతూ, యువత తమ మేధస్సును దేశ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం మంగళవారం నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ మరియు వక్తృత్వ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మొదటి, రెండవ బహుమతులను ప్రధాన అతిథులు అందజేశారు. అన్ని విభాగాల నుండి మొత్తం 60 కి పైగా విద్యార్థులకు మెడల్స్ , పుస్తకాలు బహుమతులుగా అందచేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లు డాక్టర్ నిరంజన్, డాక్టర్ టి. రాధిక, పలు విభాగాల అధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మానవ హక్కుల సమైక్య ఎన్జీవో అంతర్జాతీయ దినోత్సవం




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

బుధవారం జాతీయ మానవ హక్కుల సమైక్య ఎన్జీవో అంతర్జాతీయ దినోత్సవం కార్యక్రమం కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సెమినార్ హాల్లో అలినేని శ్రీనివాసరావు జాతీయ ఎన్. హెచ్. ఆర్.సి చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి కె. పట్టాభి రామారావు మాట్లాడుతూ పౌరులందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు తెలియజేయాలి, ప్రశ్నించే మనస్తత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలి, ప్రజాస్వామ్యం లేకుండా మానవ హక్కులు ఉండవన్నారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా మెదలాలి ప్రతి మనిషి ఒక డిగ్నిటీగా జీవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ చంద్రకుమార్ మాట్లాడుతూ 2014 తర్వాత దేశంలో, రాష్ట్రంలో పర్యావరణాన్ని పారిశ్రామికవేత్తలు విచ్చలవిడిగా పరిశ్రమలు నెలకొల్పి పర్యావరణాన్ని నాశనం చేయకుండా కాపాడి పౌరులందరికీ స్వచ్ఛమైన గాలి, నీరు, భూమి, వాతావరణము వ్యవసాయానికి అనుకూలంగా అందరూ స్వేచ్ఛ ఫలితాలు అనుభవించాలని, ధనిక, బీదల మధ్యన తారతమ్య భేదం ఎక్కువగా లేకుండా చూడాలని, చట్టాలు సక్రమంగా నీతివంతంగా జాప్యం లేకుండా అమలు చేయాలని, నిజాయితీగా ప్రశ్నించే వారి పై బూటక కాల్పులు చేయరాదన్నారు. మాజీ జాతీయ సమాచార హక్కు కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ వారి తండ్రి ఆకాలంలో స్వాతంత్ర్య సమరయోధులను సీనియర్ జర్నలిస్ట్ అని అప్పటి బ్రిటిష్ కాలము వారిని ఎదిరించి పత్రికలు నడిపి జైలుకు వెళ్లి నిర్బంధ జీవితాన్ని గడిపి పౌరులకు న్యాయం చేసే దిశలో పనిచేశారని వారి జ్ఞాపకార్థం వారి విగ్రహాన్ని కూడా వరంగల్లో పెడతామని వారి ఆశయాల కొనసాగింపు కొరకు వరంగల్ గొర్రెకుంటలో వృద్ధాశ్రమంలో ఉచిత మెడికల్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. వైద్య సేవలను ఉచితంగా పౌరులందరూ అనుభవించాలని ఎన్. హెచ్. ఆర్ .సి . జాతీయ చైర్మన్ ఐలినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఉన్న నిజాయితీ కలిగినటువంటి, నిర్భయంగా మాట్లాడగలిగే పౌరులందరూ ఈ సంస్థ ద్వారా మానవసేవలు నిరుపేదల యొక్క సమస్యలు పరిష్కార దిశలో పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మేధావులు మహిళలు జర్నలిస్టులు వివిధ సంఘాల ప్రతినిధులు 500 వరకు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ చైర్మన్ టి.సుబ్బారావు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారం, ప్రధాన కార్యదర్శి వీరేంద్ర యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు బాబు యాదవ్, చీఫ్ అడ్వైజర్ డి రాజేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ మంగళంపల్లి సదాశివుడు, ఎంజీఎం డాక్టరు సనత్ కుమార్, డాక్టర్ పి రోహిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జాతీయ కార్యవర్గమైన శ్రీనివాస్, డాక్టర్ బామిరెడ్డి నరసింహ, తిరుపతి, జిల్లా నుండి నరసింహ, గోదావరి జిల్లా నుండి రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు తులసి కళ్యాణి, జిల్లా అధ్యక్షులు పద్మ మహిపాల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దేగల శ్రీనివాస్, మొదలగు అన్ని జిల్లాల అధ్యక్షులు కార్యవర్గాలు పాల్గొని సభను దిగ్విజయం చేశారు.

# ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**– ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**




**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

కోనరావుపేట, చందుర్తి,వేములవాడ రూరల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తనిఖీ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా కోనరావుపేట, చందుర్తి, వేములవాడ రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరున్నర అడుగుల నాగుపాము

**– చాకచక్యంగా పట్టుకున్న స్నేక్ క్యాచర్ జగదీష్**

**వేద న్యూస్,వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ దక్షిణ కాశిగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవాలయ పరిసరాల్లో మరోసారి పాము దర్శనమిచ్చి భక్తుల్లో భయం పుట్టించింది. పార్వతిపురం వసతి గృహంలో బుధవారం ఉదయం సుమారు ఆరున్నర అడుగుల అడుగుల ఎత్తు గల నాగుపాము కనిపించడం తో వెంటనే స్నేక్ క్యాచర్ జగదీష్‌ను అధికారులు తెలియజేశారు.జగదీష్ చాకచక్యంగా స్పందించి పామును గోనెసంచిలో బంధించి, ఊరు బయట నిర్మానుష ప్రాంతాల్లో సురక్షితంగా వదిలిపెట్టాడు. గతంలో కూడా దేవాలయ ప్రాంగణం, వసతి గదులు, సెకండ్ బైపాస్ ప్రాంతాల్లో కొండచిలువలు, నాగుపాములు సంచరించిన అనేక సందర్భాల్లో ఇదే వ్యక్తి పాములను సురక్షితంగా పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే గత కొన్ని ఏళ్లుగా దేవస్థానంలో స్నేక్ క్యాచర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల అత్యవసర సమయంలో నిపుణుడు అందుబాటులో లేకపోవడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆలయానికి వచ్చే రాజన్న – భీమన్న భక్తుల రక్షణ కోసం తక్షణమే స్నేక్ క్యాచర్‌ను నియమించాలని పలువురు భక్తులు దేవస్థాన అధికారులను కోరుతున్నారు. దేవాలయ ప్రాంతం చెరువును ఆనుకుని ఉండటంతో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, శాశ్వత సిబ్బంది లేకపోవడం సమస్యగా మారిందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

# పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

**– ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్**



**వేద న్యూస్, పాపన్నపేట:**

నేడు జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, పూర్తిస్థాయి భద్రతా ప్రణాళికను రూపొందించి పటిష్ట బందోబస్తు అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ భద్రత, సెక్టార్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్ వంటి విభాగాల సిబ్బందికి ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ సిబ్బంది చేపట్టాల్సిన బాధ్యతలు, అనుసరించాల్సిన విధి విధానాలు, తక్షణ స్పందన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలను ఎస్పీ ఈ సమావేశంలో వివరించారు.ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో చిన్న చిన్న వివాదాలే పెద్ద సంఘటనలకు దారితీసే అవకాశం ఉంటుంది. అందుకే ముందస్తు భద్రతా చర్యలు తీసుకొని ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశాం. అధికారులు, సిబ్బంది అందరూ అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. అదే విధంగా, ఎన్నికల పర్యవేక్షణ అధికారుల సమన్వయంతో వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏ చిన్న ఉద్రిక్తత అనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకూ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ప్రదర్శనలు, బాణసంచా పేల్చడం వంటి కార్యకలాపాలకు పూర్తిగా నిషేధమని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐ లు రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శైలందర్, సందీప్ రెడ్డి, ఎసై శ్రీనివాస్ గౌడ్ గారు సిబ్బంది పాల్గొన్నారు.

# మొదటి విడత పోలింగ్ కు కట్టుదిట్టమైన భద్రత

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**



గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగు మండలాలలో ఎన్నికలు పురస్కరించుకొని బందోబస్త్ కు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఆయా పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. .పోలింగ్ జరుగు సమయంలో,ఓట్ల లెక్కింపు సమయంలో పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సమయంలో రూట్ మొబైల్ పోలీస్ అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ,పోలింగ్ కేంద్రాలు,ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తపడాలన్నారు.ఏదైన సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం అందించాలన్నారు. ఎస్పీ వెంట పోలీస్ అధికారులు,సిబ్బంది ఉన్నారు.

# ప్రపంచానికి దిక్సూచిలా 'ఓయూ'..

వచ్చానన్నారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా యూనివర్సిటీ విద్యార్థులు కదలడం వల్లే ఆ సమస్యకు పరిష్కారం లభించింది. అందులో తెలంగాణ ఉద్యమం కూడా. ఉద్యమాలతో విద్యార్థులు ఏమీ ఆశించలేదు. వారు స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కావాలని అడిగారు. యూనివర్సిటీని కాలగర్భంలో కలపడానికి కొందరు కుట్రలు పన్నారనీ మండి పడ్డారు. ఉస్మానియా ప్రపంచానికి దిక్సూచిలా గొప్పగా ఎదగాలన్నది నా సంకల్పం. విద్య ఒక్కటే అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుంది. వెనుకబాటు నుంచి బయటపడేస్తుంది. ఆత్మగౌరవం పెరుగుతుంది. తల్లిదండ్రుల్లో ఆనందం నింపుతుంది. చదువుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలి. సమస్యలొచ్చినప్పుడు నిటారుగా నిలబడి కొట్లాడండి. ప్రపంచాన్ని నడిపించగలరని నిరూపించాలి. నిబద్ధతతో కృషి చేయండి. ఇక్కడున్న వారిలోనే రేపు ఇలాంటి వేదిక నుంచి మాట్లాడే అవకాశం రావొచ్చు. మీలో కొందరు నాయకులై రాష్ట్రాన్ని పాలించాలని కోరుకుంటున్నాన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్టు అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. నిజమైన సంక్షేమం పేద వాడికి చేరాలి. సామాజిక సమస్యలపై శాశ్వత పరిష్కారం కావాలని మేం ప్రయత్నిస్తున్నాం" అని స్పష్టం చేశారు.

**– బహుజనుల తల్లిని ఆవిష్కరించాం..**

"ప్రతి బడిలో వినిపించాల్సిన 'జయ జయహే తెలంగాణ..' గీతం గత పదేళ్లుగా తొక్కి పెడితే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని రాష్ట్ర గీతంగా మార్చాం. బహుజనుల తెలంగాణ తల్లిని ఆవిష్కరించాం. 30–40 ఏళ్లుగా రగిలిన వర్గీకరణ అంశం దళిత బిడ్డల మధ్య విభజన రేఖను గీసింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదు. ఈ సామాజిక సమస్యను పరిష్కరించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ" అని వివరించారు. "గడిచిన వందేళ్లుగా ఈ దేశంలో బలహీన వర్గాల లెక్కలు లేవు. ప్రభుత్వం ఆలోచన చేసి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ కుల రాజకీయ గణన పూర్తి చేశాం. తద్వారా కేంద్రంపై ఒత్తిడి పెరిగి 2026 లో చేపట్టే జన గణనలో ఆ అంశాన్ని చేర్చారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు. బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళలు నిండుమనసుతో ఆశీర్వదిస్తేనే ఈ స్థాయిలో ఉన్నా. ఇలాంటి అవకాశం ఏ ఒక్కరికో వస్తుంది. అందుకే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఏదైనా చేయాలన్న సంకల్పం నాలో ఉందన్నారు. మనకు విద్య అందుబాటులో ఉంది కానీ నాణ్యమైన విద్య అందకపోవడమే సమస్య. నైపుణ్యం కలిగిన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేరుతో వేర్వేరుగా పాఠశాల నిర్వహణ వల్ల వివక్ష ఎలా రూపుమాపగలం. అందుకే ఆలోచన చేసి విద్యార్థులంతా ఒకే క్యాంపస్ లో చదువుకోవాలన్న లక్ష్యంగా మహాత్మాగాంధీ గారి స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ చేపట్టాం" అని తెలిపారు.

**– 'పోటీ' ప్రపంచంతో..**

"విద్య కోసం పెట్టే ఖర్చు భవిష్యత్తరాల కోసం పెట్టుబడిగా చూస్తున్నాం. పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉంది. పరిశోధనల్లో ఇబ్బంది పడొద్దు. ప్రపంచంతో పోటీ పడాలి. ఆత్మస్థయిర్యం కోల్పోవద్దు. నాలెడ్జ్ వేరు, కమ్యూనికేషన్ వేరు. నాలెడ్జ్, కమిట్మెంట్, కన్విక్షన్ దేశంలో ఏ స్థాయికి ఎదగడానికైనా ఉపయోగపడుతుంది. యూనివర్సిటీలో నియామకాలు, నిర్ణయాల్లో ఎవరి పైరవీలు ఉండవు. రాజకీయ జోక్యం ఉండదు. పైరవీ చేసే వారి ఉద్యోగం తీసేద్దాం. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోండి. పిల్లల జీవితంతో ఆటలాడే హక్కు ఎవరికీ లేదు. కావలసిన సహకారం అందించే బాధ్యత మాది" అని సీఎం రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సలహాదారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కాశీం, ప్రజా ప్రతినిధులు, పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసిన ఎన్నికల సంఘం సీఈఓ

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) ల గోడౌన్ ను ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా సిరిసిల్ల మున్సి పల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసేందుకు ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి సీఈఓ సుదర్శన్ రెడ్డి చేరుకోగా, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఈఓ.. ఇంచార్జి కలెక్టర్ తో పలు అంశాలపై చర్చించారు. అక్కడి నుంచి సీ ఈ ఓ నేరుగా సర్దాపూర్ లోని ఈవీఎం గోడౌన్, ఈవీఎంలను ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు

# విలీనమే శాశ్వత పరిష్కారం..!

**వేద న్యూస్, హైదరాబాద్ :**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లిలో రామన్న చెరువు నీరు పొంగి పరిసర కాలనీలు మునిగిపోతున్న పరిస్థితిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువు నిర్వహణలో నిర్లక్ష్యం, సమస్య పరిష్కారంలో బాధ్యతా రాహిత్యం స్థానిక ప్రజలను ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పూర్తిగా నిండిపోవడంతో సమీప కాలనీలు నీట మునిగిపోయాయని, ప్రజలు నిత్యజీవనంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత తెలిపారు. "ఈ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజల భద్రతకు సంబంధించి ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చర్యలు అవసరం" అని ఆమె అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతం ప్రత్యేక పరిపాలనలో ఉండటం వల్ల సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదని కవిత మండిపడ్డారు. "జీహెచ్ఎంసీ పరిధిలో చుట్టుపక్కల 27 మున్సిపాలిటీలను విలీనం చేశారు. కానీ కంటోన్మెంట్ మాత్రమే విలీనం కాకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో కలిపితేనే నిధులు వచ్చి కార్పొరేటర్ పనులు చేయించగలుగుతారు" అని ఆమె స్పష్టం చేశారు. రామన్న చెరువు మరమ్మతులు, శాశ్వత పరిష్కారాల కోసం జాగృతి శాయశక్తులా కృషి చేస్తుందని కవిత హామీ ఇచ్చారు. "చెరువు పునరుద్ధరణకు, వరద ప్రమాదం లేకుండా చర్యలు తీసుకునేందుకు మేము ప్రజల పక్షాన నిలబడతాం" అని ఆమె తెలిపారు.

# ఆటో కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది




తున్నాడు" అని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని, దేవుళ్లపై అబద్ధపు ఒట్లు పెడుతున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ముఖ్యమైన సంక్షేమం నిర్లక్ష్యం చెయ్యబడుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "420 హామీలు ఇచ్చి అందరినీ మోసం చేశారు. నెలకు వెయ్యి రూపాయల చొప్పున రెండు సంవత్సరాల కాలంలో ఆటో డ్రైవర్లకు రూ.1560 కోట్లు బకాయి ఉందని" ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్నిరకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి వరకు బీమా కల్పిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును అసెంబ్లీ సమావేశాల వరకు ఏర్పాటు చేయకపోతే, హైదరాబాద్‌లో మహాధర్నా చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. "కాంగ్రెస్ ఊరికే ఏమీ ఇవ్వదు గల్లా పట్టి అడిగితేనే ఇస్తుంది" అని సెటైర్ వేశారు. ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం అందించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, వారి సంక్షేమం కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# అందరినీ కలుస్తూ.. ఆత్మీయంగా ఓటు అభ్యర్థిస్తూ..





**వేద న్యూస్, సుల్తానాబాద్:**

ప్రజాసేవే ధ్యేయంగా సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన సర్పంచ్ అభ్యర్థి ఓగుల పూజ రాజేందర్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కాట్నపల్లి గ్రామ ప్రజలందరినీ కలుస్తూ.. ఆత్మీయంగా ఓటు అభ్యర్థిస్తున్నారు. కత్తెర గుర్తుకు ఓటేయాలని కోరుతూ గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం సర్పంచ్ అభ్యర్థి పూజ, మద్దతుదారులు ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

**ఆశీర్వాదాలు పొందుతూ..**

ప్రచారంలో భాగంగా సర్పంచ్ అభ్యర్థి పూజ రాజేందర్ దంపతులు ఓటు అభ్యర్థిస్తూ.. ప్రజల ఆశీర్వాదాలు పొందుతూ ముందుకు సాగుతున్నారని ఈ సందర్భంగా పలువురు పేర్కొంటున్నారు. కాట్నపల్లి గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా తమ అడుగులు ఉంటాయని, అవినీతికి తావు లేకుండా పరిపాలన అందిస్తామని హామీనిస్తున్నారు. తాము పేదరికం నుంచి వచ్చిన వారమని, పేదరికం విలువ తెలిసిన మనుషులం కాబట్టి.. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు .. చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సర్పంచ్ అభ్యర్థి ఓగుల పూజ రాజేందర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఆమనగల్లులో గులాబీ జెండా ఎగరాలి

**- మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలో ని ఆమనగల్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన విస్తృతంగా పర్యటించి ఆమనగల్లు బారాస బలపరిచిన అభ్యర్థి వల్లంపట్ల లక్ష్మమ్మ పోశయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి జరిగాయన్నారు. బారాస బలపరిచిన అభ్యర్థి వల్లంపట్ల లక్ష్మమ్మ పోశయ్య బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పేరాల కృపాకర్ రావు, ఆమనగల్ మాజీ ఎంపిటిసి మేక లలిత రవి, కోల పాపయ్య, మేక దేవరాజు, బంటు రామాంజి, బంటు రామకృష్ణ, నానబాల సత్యం,బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# జనంలోకి యువనేత సందీప్

- అందరినీ కలుస్తూ.. ఉంగరం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన
- స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి విస్తృత ప్రచారం
- యువత రాజకీయాల్లో ఎదిగేలా ప్రోత్సహించాలని వేడుకోలు





**వేద న్యూస్, హన్మకొండ:**

దేవునూరు గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కొంగంటి సందీప్ ప్రచారంలో ముందుకెళు_న్నారు. గ్రామ ప్రజలను అందరినీ కలుస్తూ.. ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ఆత్మీయంగా అభ్యర్థిస్తున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని బలంగా ఆకాంక్షించే ప్రజలు, ఆ దిశగా అడుగులు వేస్తున్న తన వంటి వారిని ఆదరించి.. గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తనకు అండగా నిలిచి.. నిండుగా, మెండుగా ఆశీర్వదించాలని ప్రజలను సర్పంచ్ అభ్యర్థి కే సందీప్ వినమ్రపూర్వకంగా కోరుతున్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన అధికారులు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు బాలమాయాదేవి తో కలసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి బుధవారం సందర్శించారు. వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయం, రాయపర్తి జెడ్పిహెచ్ఎస్ లో, పర్వతగిరి తెలంగాణ మోడల్ స్కూల్ లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఏర్పాటుచేసిన గ్రీన్ పోలింగ్ స్టేషన్లను సాధారణ పరిశీలకులు, కలెక్టర్ లు పరిశీలించారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, నోడల్ అధికారులు సురేఖ, రవీశంకర్, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, స్థానిక అధికారులు ఉన్నారు.

# తడి చెత్త నుండి ఎరువు తయారీని ప్రోత్సహించాలి

**- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నగర వాసులకు తడి చెత్త నుండి ఎరువు తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. క్షేత్ర స్థాయి శానిటేషన్ పరిశీలనలో భాగంగా కమిషనర్ 39,40 డివిజన్ లలో ప్రత్యక్షంగా పరిశీలించి తడి పొడి చెత్తను వేరుగా అందించడాన్ని పరిశీలించి నిర్వహణ తీరును ప్రశంసించి అన్ని డివిజన్ లలో ఈ విధానాలను అవలంబించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చెత్తను వేరుచేసి అందించడంలో భాగంగా 39 వ డివిజన్ లో చెత్త ను అందిస్తున్న తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి గడపకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరుగా అందించే విధానాన్ని కమిషనర్ వివరించి మాట్లాడుతూ స్థానిక మహిళల తో పాటు వాలంటీర్లు స్వచ్ఛ ఆటో డ్రైవర్లు సమన్వయంతో చక్కగా తడి పొడి చెత్తను వేరుగా అందించడం అభినందనీయమని ఇదే తరహా విధానాన్ని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని డివిజన్ లలో కొనసాగించేలా చూడాలని అన్నారు. ఈ క్రమంలో మెప్మా విభాగానికి చెందిన స్థానికంగా నివసించే పద్మ అనే మహిళ తడి చెత్త ను ఉపయోగించి ఎరువు (మెన్యూర్) తయారు చేయడాన్ని పరిశీలించిన కమిషనర్ అభినందిస్తూ పద్మను స్ఫూర్తిగా తీసుకొని గృహిణిలు తడి చెత్తను ఎరువుగా మార్చాలని, గ్రేటర్ పరిధి లో ఉన్న ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్త వేరుగా అందించాలని ఇందుకు సరిపోయే ట్రీట్మెంట్ ప్లాంట్ లు అందుబాటులో ఉన్నాయని తడి పొడి చెత్త ను ఇవ్వని గృహాల కు పెనాల్టీ విధించే హక్కు కార్పొరేషన్ కు ఉంటుందని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఇంట్లోకి రాకుండా చూడాలని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం- 2016 ప్రకారం నగర వాసులు ప్రతి 3 సం. లకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్ ను క్లీనింగ్ చేయించుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు సిద్ధం రాజు, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, టిఎంసి రమేష్, ఆస్కి ప్రతినిధి రాజ్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల పరకామణి చోరీ కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**అమరావతి, వేద న్యూస్:**

తిరుమల పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక సూచనలు, ఆదేశాలను జారీ చేసింది. కేసులో నమోదైన ఎన్వీఆర్‌ను కొనసాగిస్తూ చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవడానికి సీఐడీ, ఏసీబీ డీజీలకు న్యాయస్థానం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. లోక్ అదాలత్‌లో రాజీ చర్చలు కొనసాగుతున్నప్పటికీ, దర్యాప్తు ఏ దశలోనూ ఆగకూడదని హైకోర్టు స్పష్టంగా పేర్కొంది. నిందితుడు రవికుమార్ ఆస్తులపై సమగ్ర విచారణ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తు ప్రభావవంతంగా సాగేందుకు సీఐడీ, ఏసీబీ పరస్పరం సేకరించిన సమాచారాన్ని పంచుకోవాలని హైకోర్టు సూచించింది. ఇరు సంస్థలు సమన్వయంతో పనిచేస్తే కేసు నిజానిజాలు వేగంగా వెలుగులోకి వస్తాయని కోర్టు అభిప్రాయపడింది. కేసు సున్నిత స్వభావం దృష్ట్యా ఏ అంశాన్నీ వదిలిపెట్టకుండా దర్యాప్తు కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.టీటీడీ మాజీ ఏవీఎస్వో వై. సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికేట్‌ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని హైకోర్టు సీఐడీకి ఆదేశించింది. దర్యాప్తు భాగంగా సమీకరించిన సమాచారాన్ని అవసరమైతే ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పంచుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

# ఓటు "వజ్రాయుధం"



**బొజ్జ సురేశ్**
**పాఠ్యాంశ రచయిత**
**8008200870**

ఓటు హక్కు ఒక వజ్రాయుధం
ఓటు మా..మన హక్కు
ఓటు హక్కు ప్రాథమిక హక్కు
ఓటు వేయడం ప్రతి పౌరుని
బాధ్యత
ఓటు నిజాయితీగా వేద్దాం
ఓటుతో ప్రజాస్వామ్యాన్ని
కాపాడుదాం
ఓటు విలువ తెలుసుకో
ఓటు వేసి నీ విలువ పెంచుకో
ఓటు ప్రజాస్వామ్యం మనుగడ
ఓటు జీవుల మనుగడకు
ప్రాణవాయువు
ఓటు అమ్ముకోవద్దు
పాలకులను ప్రశ్నించే హక్కును
కోల్పోవద్దు
ఓటు అభివృద్ధికి అడ్డుకావద్దు
ఓటుతో చేటు తెచ్చుకోవద్దు
ఓటు వేయడం మీ..మన
కర్తవ్యం
ఓటు ప్రలోభాలకు గురికావద్దు
ఓటు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా
వినియోగించుకో
నీ హక్కును కాపాడుకో

# జనం మెచ్చేలా జనసేన అభ్యర్థి మేనిఫెస్టో

- 18 హామీలతో విడుదల చేసిన సర్పంచ్ క్యాండిడేట్ మమత
- మర్రిపల్లిగూడెం సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ.. హామీలు





**వేద న్యూస్, హుజూరాబాద్ ప్రతినిధి:**

జనసేన పార్టీ బలపరిచిన మర్రిపల్లిగూడెం సర్పంచ్ అభ్యర్థి బుధవారం మేనిఫెస్టో విడుదల చేశారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఐదేండ్ల పాలన కాలంలో చేయబోయే పనులను ప్రస్తావిస్తూ.. మేనిఫెస్టో రిలీజ్ చేశారు. మర్రిపల్లిగూడెం సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ.. 18 హామీలు ఇచ్చినట్టు వెల్లడించారు. స్వర్గ రథం ఏర్పాటు, గ్రామ దేవతలు పునః ప్రతిష్టాపన, వినియోగంలోకి గ్రంథాలయం, వారసంత (అంగడి) ఏర్పాటు,ప్రతివీధికి పూర్తి స్థాయిలో లైటింగ్, డ్రైనేజి, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికీ అకౌంట్, రూ.2 లక్షల ఇన్సూరెన్స్, ప్రతి వీధిలో చెత్త కుండీల ఏర్పాటు, గ్రామ పంచాయతీ సిబ్బందిలో ఒకరికి బాధ్యత, చెరువుల హద్దుల ఏర్పాటు, ఉపాధి హామీ పథకం కింద చెరువుల పూడిక తీత, ఎస్సారెస్పీ కెనాల్, చెరువు కట్టలు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారుల వెంట ఉపాధి హామీ పథకం ద్వారా స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణ, వీధి కుక్కలు, కోతుల బెడద లేకుండా చర్యలు, సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాల్లో కమిటీదే పూర్తి అజమాయిషికి బాధ్యత, అర్హులకు మాత్రమే 'డబుల్' ఇండ్ల పంపిణీకి తొలి ప్రాధాన్యత, తూ.చ. తప్పకుండా గ్రామ సభ తీర్మాన ప్రతుల ఏర్పాటు (సభకు ముందుగానే కరపత్రాల ద్వారా ప్రతి గడపకు పంపిణీ),ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా అందేలా చర్యలు, గ్రామ పంచాయితీ ఆదాయ వ్యయ వివరాలను ప్రతి గ్రామ సభలో ప్రవేశపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, పాఠశాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత, పల్లె దవాఖాన అప్‌గ్రేడేషన్ కోసం, నిరంతరం వైద్య సదుపాయల కోసం కృషి వంటి కీలక హామీలని ప్రస్తావించారు. మర్రిపల్లిగూడెం గ్రామ ప్రజలు,మేధావులు, ఆలోచనపరులు, విజ్ఞులైన జనం కత్తెర గుర్తుకు ఓటేసి.. అభ్యర్థి మమతను సర్పంచ్‌గా గెలిపించాలని జనసైనికులు కోరుతున్నారు.

వేద న్యూస్



# పర్యావరణ సమతుల్యత స్థావరాలు..

- ప్రకృతి ప్రసాదించిన వరాలు..'పర్వతాలు'
- నేడు ప్రపంచ పర్వత దినోత్సవం

పర్వతాలు భూమి మొత్తం భూభాగంలో దాదాపు 24 శాతం నుండి 27 శాతం వరకు ఆక్రమించి, భారతదేశ మొత్తం భూభాగంలో 30 శాతం ఆక్రమించాయి. అనేక కారణాల వల్లఈ సహజ కవచాలైన పర్వత సహజ వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు 15 శాతం మంది ప్రజలు పర్వత ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. ఈ ఒక్క విషయం పర్వతాల ప్రాముఖ్యతను మనకు తెలియజేస్తుంది. పర్వతాల పరిరక్షణ, వాటిలోని జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం డిసెంబర్ 11వ తేదీన అంతర్జాతీయ పర్వత దినోత్సవాన్ని (ఇంటర్నేషనల్ మౌంటైన్ డే) జరుపుకుంటారు. 2025 అంతర్జాతీయ పర్వత దినోత్సవం (ఇంటర్నేషనల్ మౌంటైన్ డే) థీమ్ "పర్వతాలు, అంతకు మించి నీరు, ఆహారం, జీవనోపాధికి హిమానీనదాలు ముఖ్యమైనవి", ఇది 2025ని అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సమయంలో వేగంగా హిమానీనదాలు కరుగడం, వాతావరణ ప్రభావాలు మరియు ఈ కీలకమైన మంచినీటి వనరులు మరియు పర్వత సమాజాలను రక్షించడానికి అత్యవసర చర్య తీసుకోవలసిన అవసరాన్ని ప్రాముఖ్యతను తెలియచేస్తుంది.

పర్వతాల ఆవిర్భావం ఒక అద్భుత ప్రక్రియ భూమి చల్లబడే క్రమంలో సంభవించిన భౌగోళిక మార్పుల ఫలితంగా పర్వతాలు ఏర్పడ్డాయి. భూమి ఉపరితలం మొదట్లో ద్రవ రూపంలో, వాయు రూపంలో ఉండే పదార్థాలతో కూడిన ఒక అగ్నిగోళం. సుమారు 200 కోట్ల సంవత్సరాల క్రితం ఈ గోళం చల్లబడి, ఉపరితలం గట్టిపడటం ప్రారంభించింది. ఈ గట్టి పొర కింద అత్యంత వేడి ద్రవ రూపంలోని పదార్థాలు ఉన్నాయి.భూమి చల్లబడి కుంచించుకుపోయే (కాంట్రాక్షన్) ప్రక్రియలో, ఉపరితలంపై ఉన్న సుమారు 20 కిలోమీటర్ల మందపాటి గట్టి పొరలో ముడతలు ఏర్పడ్డాయి. గ్రానైట్ ఫలకాలతో ఏర్పడిన ఈ ఉపరితల పొర, ఒత్తిడికి గురైనప్పుడు ధనుస్సుల్లాగా వంగి, కొన్ని ప్రాంతాలు పైకి లేచాయి. ఈ ఫలకాలు ముడుచుకుపోయి, పగిలి, నెర్రెల రూపంలో విచ్ఛిన్నం చెందాయి. ఈ వంగిన, విరిగిన శిలా భాగాలే భూమి పైకి పొడుచుకు వచ్చి పర్వతాలుగా రూపుదిద్దుకున్నాయి. పర్వతాల ఉపయోగాలు, ప్రాముఖ్యత పర్వతాలు కేవలం భౌగోళిక నిర్మాణాలు మాత్రమే కావుబీ అవి మానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు మూల స్థావరాలు.

**పర్వతాలు – జీవవైవిధ్యం**

పర్వతాలు ప్రపంచ జనాభాలో సగం మందికి పైగా ప్రజలకు జల వనరుల రూపంలో మంచినీటిని అందిస్తున్నాయి. మన దేశంలోని అనేక జీవ నదులు (ఉదాహరణకు, గంగా, యమునా) పర్వతాలలోనే జన్మించాయి. ఇవి మేఘాలకు అడ్డంకిగా నిలిచి, వర్షాలు కురవడానికి ముఖ్య కారణంగా తగినంత వర్షపాతనికి ఊతమిస్తున్నాయి. భూగర్భ జలాన్ని పెంచుతూ జీవకోటి మనుగడకు తోడ్పడుతున్నాయి. పర్వత శ్రేణులు అనేక రకాల వృక్ష, జంతు జాతులకు ఆవాసాలుగా ఉంటూ అపారమైన జీవవైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. చారిత్రక, భౌగోళికంగా పర్వతాలు దేశాలకు సహజసిద్ధమైన రక్షణ కవచాలుగా నిలిచాయి. ఆది మానవుని కాలం నుంచి అనేక నాగరికతలకు పర్వతాలు ఆలవాలమై, మన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలుగా నిలిచాయి.

**సవాళ్లు, పరిష్కారాలు**



"స్థిరమైన భవిష్యత్తు కోసం పర్వత పరిష్కారాలు – ఆవిష్కరణ, అనుసరణ, యువత, అంతకు మించి" అనేది 2024 అంతర్జాతీయ పర్వత దినోత్సవం థీమ్. ఈ థీమ్ పర్వతాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి తక్షణ చర్యలు అవసరమని నొక్కి చెబుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ మార్పు జరిగి పర్వతాలపైన ఉన్న మంచు దిబ్బలు వేగంగా కరిగిపోతున్నాయి. ఇది దిగువ ప్రాంతాల్లోని కోట్ల మంది ప్రజల మంచినీటి సరఫరాపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. బాహ్య కుత్రిమ కాలుష్యం వలన వాతావరణ కాలుష్యం, సహజ వనరుల విచక్షణారహిత వినియోగం పర్వత ప్రాంత ప్రజల మనుగడను కష్టతరం చేస్తోంది. మానవ అవ సరానికి మించి స్వార్ధ మానవ మాన వ జోక్యం వలన గ్రానైట్ వంటి ఖనిజ సంపద కోసం పర్వతాలను తవ్వడం, వాటి సహజ రూపాన్ని దెబ్బతీయడం వల్ల పర్యావరణ సమతుల్యతకు, వాటర్ షెడ్ల పునాదులకు ప్రమాదం ఏర్పడుతోంది. ఈ అంశం ప్రస్తుతం చాలా ముఖ్యమైనది మరియు సమ కాలీన పర్యావరణ సమస్యల్లో ఒకటి పరిగనించి సమస్య పరిష్కారమార్గం చూసుకోవాలి.

**పర్వతాల సహజత్వానికి ముప్పు**

పర్వతాలు, గుట్టలు ఏ విధంగా ఆక్రమణలు, పోడు వ్యవసాయం, మైనింగ్ వంటి కార్యకలాపాల వల్ల తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయో పరిశీలన చేసుకోవాలి. అది ఎలాగం టే పర్వతాలు, గుట్టలు కేవలం ప్రకృతి సౌందర్యం మాత్రమే కాదు, అవి జీవ వైవిధ్యానికి, జలవనరులకు, పర్యావ రణ సమతుల్యతకు కేంద్రాలు. కానీ, మానవ



కార్యకలాపాల వల్ల ఇవి తీవ్రమైన ఆక్రమణకు, విధ్వంసానికి గురవు తున్నాయి. ఆక్రమణలు (ఎంక్రోచ్మెం ట్స్) పర్వతాలు, గుట్టల భూములను ఆక్రమించడం అనేక రూపాల్లో జరు గుతోంది. నివాస ప్రాంతాల విస్తరణ దిశగా పెరుగుతున్న జనాభా అవసరా ల కోసం పట్టణాలు, గ్రామాలు పర్వతాల వైపు విస్తరిస్తున్నాయి. గుట్టల వాలుపై ఇళ్ళు, కాలనీలు నిర్మిం ఓచడం వల్ల సహజ వాలు (స్లోప్) మారిపోయి, కొండచరియలు విరిగిపడే (ల్యాండ్స్లయిడ్స్) ప్రమాదం పెరుగుతుంది. అనేక అధికారిక, అనధికార నిర్మాణాల రూపాలలో రిసార్టులు, హోటళ్ళు, వినోద కేంద్రాలు, రోడ్ల నిర్మాణాల కోసం గుట్టలను చదును చేయడం లేదా వాటిని ఆక్రమించడం జరుగుతోంది. దీనివల్ల సహజ పారుదల వ్యవస్థ (డ్రైనేజీ సిస్టం) దెబ్బతిని వరదలు వచ్చే అవకాశం పెరుగుతుంది. గైర్హాజరు వ్యవసాయం (నాన్–లోకల్ ఫార్మింగ్) రూపంలో మైదాన ప్రాంత ప్రజలు లాభాల కోసం గుట్టల భూములను ఆక్రమించి, భారీ ఎత్తున తోటల పెంపకం లేదా ఇతర పంటలు వేయడం. పోడు వ్యవసాయం (షిఫ్టింగ్ కల్టివేషన్ లేదా ఝూమ్ కల్టివేషన్) రోజు రోజుకూ పెరిగిపోతోంది. పోడు వ్యవసాయం అనేది ప్రధానంగా అటవీ ప్రాంతాల్లోని గిరిజనులు తమ సంప్రదాయ అవసరాల కోసం చేసే ఒక పద్ధతి. అయితే, ఇది నియంత్రణ లేకపోవడం వల్ల పర్వతాలకు హాని కలిగిస్తోంది. ముఖ్యంగా పోడు విధానంలో గిరిజనులు ఒక పర్వత ప్రాంతాన్ని ఎంచుకుని, అక్కడ అడవులను నరికి, కాల్చివేసి, ఆ బూడిదను ఎరువుగా వాడుతూ కొంతకాలం పంటలు పండిస్తారు. ఆ తర్వాత భూసారం తగ్గితే, ఆ ప్రాంతాన్ని వదిలి మరో కొత్త ప్రాంతానికి మారతారు.

**గుట్టలు అదృశ్యం**

సహజత్వానికి ముప్పు మైనింగ్ వల్ల గుట్టలు పూర్తిగా చదును చేయబడి లేదా పెద్ద లోయలుగా మారి అదృశ్యమవుతాయి. ఈ ప్రకృతి విరుద్ధ చర్యల వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడి మైనింగ్ కారణంగా గాలి కాలుష్యం (ధూళి వల్ల) మరియు శబ్ద కాలుష్యం పెరుగుతాయి. జల వనరుల విధ్వంసం మైనింగ్ వల్ల భూగర్భ జలాల నిల్వలు దెబ్బతిని, ఆ ప్రాంతంలోని బావులు, బోర్లలో నీటి మట్టం తగ్గిపోతుంది. నదులు, వాగులలో పూడిక (సిల్టేషన్) పెరిగి, వాటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతుంది. పైన పేర్కొన్న అన్ని కార్యకలాపాల వల్ల పర్వతాలు, గుట్టలు తమ సహజత్వాన్ని అనేక విధాలుగా కోల్పోతాయి. సహజ ఆకారం మార్పు రూపంలో మైనింగ్, నిర్మాణాలు గుట్టల సహజ రూపాన్ని మార్చి, వాటిని వికృతంగా మారుస్తాయి. ఆ పరిసరాల్లో వృక్ష సంపద నష్టం పోడు, ఆక్రమణల వల్ల పచ్చదనం పోయి, భూమి బీడుగా మారుతుంది. ఈ కారణాలవలన జీవావరణ సమతుల్యత విచ్ఛిన్నంతో వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు, నేల మరియు నీటి మధ్య ఉన్న సహజ సమతుల్యత దెబ్బతింటుంది. సహజ పర్వత శ్రేణులు కోల్పోవడం వలన సహజ రక్షణ సామర్థ్యం తగ్గి అడవులు నశించడం వల్ల, అవి అందించే వరద నివారణ, గాలిని శుద్ధి చేసే సామర్థ్యం తగ్గిపోతుంది.**పర్వతాలు – జీవవైవిధ్యం**

పర్వతాలు ప్రపంచ జనాభాలో సగం మందికి పైగా ప్రజలకు జల వనరుల రూపంలో మంచినీటిని అందిస్తున్నాయి. మన దేశంలోని అనేక జీవ నదులు (ఉదాహరణకు, గంగా, యమునా) పర్వతాలలోనే జన్మించాయి. ఇవి మేఘాలకు అడ్డంకిగా నిలిచి, వర్షాలు కురవడానికి ముఖ్య కారణంగా తగినంత వర్షపాతనికి ఊతమిస్తున్నాయి.సహజత్వానికి ముప్పు మైనింగ్ వల్ల గుట్టలు పూర్తిగా చదును చేయబడి లేదా పెద్ద లోయలుగా మారి అదృశ్యమవుతాయి. ఈ ప్రకృతి విరుద్ధ చర్యల వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడి మైనింగ్ భూగర్భ జలాన్ని పెంచుతూ జీవకోటి మనుగడకు తోడ్పడుతున్నాయి. పర్వత శ్రేణులు అనేక రకాల వృక్ష, జంతు జాతులకు ఆవాసాలుగా ఉంటూ అపారమైన జీవవైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. చారిత్రక, భౌగోళికంగా పర్వతాలు దేశాలకు సహజసిద్ధమైన రక్షణ కవచాలుగా నిలిచాయి. ఆది మానవుని కాలం నుంచి అనేక నాగరికతలకు పర్వతాలు ఆలవాలమై, మన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలుగా నిలిచాయి.

**పర్వతాల రక్షణ చర్యలు అత్యవసరం**

ఈ సమస్యలను ఎదుర్కోవడానికి కఠినమైన చట్టాలు, ప్రజల్లో విస్తృత అవగాహన, మరియు సుస్థిరమైన అభివృద్ధి పద్ధతులను (సస్టైనబుల్ డెవలప్మెంట్ ప్రాక్టీసెస్) అనుసరించడం అవసరం. ఈ సమస్యలను పరిష్కరించడానికి, వాతావరణ కాలుష్యానికి కారణమయ్యే చర్యలకు దూరంగా ఉండటం మన కర్తవ్యం. సహజ వనరులను పరిరక్షించడం, పర్వతాల పరిధిలోని అద్భుతమైన ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. పర్వతాలు మన భౌగోళిక స్వరూపానికి నిదర్శనాలు, వర్షపు నీటిని ఒడిసిపట్టి నదులు, వాగులు, వంకలు, లోయలు ఏర్పడటానికి దోహదపడుతున్నాయి. అవి తరతరాల నుంచి మనకు వారసత్వ సంపదను అందించాయి. ఈ అంతర్జాతీయ పర్వత దినోత్సవం సందర్భంగా, మనం మన పర్వతాలను పరిరక్షించుకోవాలి. స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని నాశనం చేయకుండా, ఈ అపురూపమైన సహజ సంపదను రాబోయే తరాలకు అందించగలగాలి. పర్వతాల పరిరక్షణే మానవ మనుగడకు, స్థిరమైన భవిష్యత్తుకు ఆధారం.


**– రవిబాబు పిట్టల, ఎంఎస్సీ, ఎంటెక్(పీహెచ్డీ), పర్యావరణవేత్త, ఫార్మర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఎన్టీయూహెచ్, జాయింట్ సెక్రెటరీ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ.**

# సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి

- ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టుతో కలకలం
- ఫోటోలు, వీడియోలతో బెదిరించి వేధింపుల ఆరోపణలు
- వర్సిటీ విచారణ కమిటీ, పోలీసుల వేగవంత దర్యాప్తు

**అమరావతి, వేద న్యూస్:**

తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటన కలకలం రేపింది. ఈ కేసులో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను పోలీసులు అరెస్టు చేశారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్కు చెందిన డాక్టర్ లక్ష్మణ్ కుమార్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పాటు, ఆయనకు సహకరించిన మరో ప్రొఫెసర్ ఎ.శేఖర్ రెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన 27 ఏళ్ల యువతి బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న సందర్భంలోనే ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. విద్యార్థినిని ప్రలోభపెట్టిన డాక్టర్ లక్ష్మణ్ కుమార్ తన కార్యాలయంలోనే దాడికి పాల్పడ్డాడు. ఈ సమయంలో మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి ఫోటోలు, వీడియోలు తీసి వాటిని సోషల్ మీడియాలో పెట్టి అవమానపరుస్తానని బెదిరించి మరింత లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. వేధింపులు తీవ్రరూపం దాల్చడంతో విద్యార్థిని వర్సిటీ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేసింది. విద్యార్థినిచే ఇచ్చిన ఫిర్యాదును సీరియస్గా తీసుకున్న వర్సిటీ అధికారులు అంతర్గత విచారణ కమిటీని నియమించారు. కమిటీ నివేదిక అందిన వెంటనే డాక్టర్ లక్ష్మణ్ కుమార్ను సస్పెండ్



చేశారు. అనంతరం వర్సిటీ ఇన్చార్జ్ రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా తిరుపతి పడమర పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలోని పోలీసుబంధం బాధితురాలి స్వగ్రామానికి వెళ్లి వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. సాక్ష్యాలు, ఫిర్యాదులు, డిజిటల్ ఆధారాలను పరిశీలించిన పోలీసులు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేశారు. తరుణ విద్యార్థినిపై జరిగిన ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, విచారణను వేగంగా పూర్తి చేస్తామని పోలీసులు తెలిపారు.

# మానవ హక్కులు పుస్తకాల పదాలు కాదు

- ప్రజాస్వామ్య ప్రాణవాయువు
- సమానత్వం అంటే పంచుకునే హక్కు
- రాష్ట్ర నీతి – పౌర గౌరవాన్ని కొలిచే కొలమానం
- స్వరక్షణ కోసం సమాజమే సంరక్షకుడు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న వస్తుంది. కానీ ఈ రోజు అనేది గత ఘోర అన్యాయాల్ని జ్ఞాపకం చేసుకోవడానికో, పుస్తకాలలో ఉన్న అద్భుతమైన మాటలను చదవడానికో మాత్రమే కాదు. ఇది ప్రతి మనిషి జీవిత హక్కు, స్వేచ్ఛ, గౌరవం అనే విలువలు ఎందుకు ఆవశ్యకమో గుర్తు చేసే శక్తివంతమైన సందర్భం. మానవ హక్కులు ప్రభుత్వాలు ఇవ్వే బహుమతులు కాదుబీ అవి మనిషిగా పుట్టినప్పుడే కలిగే సహజ హక్కులు. ఈ సూత్రం కాలక్రమేణా బలం దుతున్నా, ప్రపంచమంతటా జరుగుతున్న సంఘటనలు మాత్రం ఈ విలువలపై మళ్ళీ మళ్ళీ ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉన్నాయి.

సమానత్వం, వివక్ష లేకపోవడం, అభివ్యక్తి స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కు ఇవన్నీ ప్రజాస్వామ్యానికి పునాది. కానీ ఈ పునాదులు ఎంత బలహీనంగా ఉంటాయో, సాధారణ ప్రజలకు న్యాయం చేరువ కావడంలో ఎంత అడ్డంకులు ఉంటాయో రోజూవారీ ఘటనల్లో మనం చూస్తూనే ఉన్నాం. పేదరికం, జాతి%–%వర్గ%–%మత వివక్షలు, లింగ అసమానత, వలస సమస్యలు, డిజిటల్ ప్రపంచంలో ప్రైవసీ ఉల్లంఘనలు%ౌ% ఈ కాలంలో మానవ హక్కులను దిగజార్చే సవాళ్లు కొత్త అమ్ములు తొడుగుతున్నాయి. మానవ హక్కుల ఉల్లంఘన ఒక దేశానికి పరిమితం కాదుబీ అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాధితుల మౌనంలో దాగి ఉన్న సత్యం. ఆ నిశ్శబ్దానికి స్వరం ఇవ్వడమే ఈ దినోత్సవం లక్ష్యం.

సమాజ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి కాదు ప్రతి మనిషి గౌరవ భావనను రక్షించే వ్యవస్థ. ప్రభుత్వాలు చట్టాలు చేయగలవు, రాజ్యాంగం హామీలు ఇవ్వగలదు, అంతర్జాతీయ సంస్థలు తీర్మానాలు పాస్ చేయగలవు కాని వాటిని జీవించే శక్తి ప్రజల నుంచే వస్తుంది. మానవ హక్కుల పరిరక్షణలో రాష్ట్రం కీలక భాగమనే సంగతిని ఖండించలేం. పోలీస్ వ్యవస్థ నుండి న్యాయవ్యవస్థ వరకు, విద్యా రంగం నుండి ఆరోగ్య రంగం వరకు ప్రతి స్థాయిలో హక్కుల గౌరవం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో బలపడుతుంది. అధికారానికి బాధ్యత, విధానాలకు పారదర్శకత, పాలనలో ప్రజల భాగస్వామ్యం ఇవన్నీ మానవ హక్కుల అసలైన రూపరేఖలు.

అయితే మానవ హక్కుల భవిష్యత్తు ప్రభుత్వాల చేతుల్లో మాత్రమే ఉందని అనుకోవడం తప్పు. అది సమాజం కలిసొచ్చినప్పుడే సార్థకమవుతుంది. ప్రతి పౌరుడు తన పక్కవాడి హక్కును కాపాడినప్పుడే ఈ విలువలు బతుకుతాయి. పాఠశాలల్లో పిల్లలకు గౌరవం, వివక్ష లేని భావనలను నేర్పడం నుంచి, సోషల్ మీడియా యుగంలో ద్వేషపూరిత సమాచారాన్ని నిరోధించడం వరకు బాధ్యత ప్రతి ఒక్కరిది. హక్కులను మనం ఇతరులకు ఇచ్చే గిఫ్ట్లా భావించడం కాదుబీ వాటిని పరస్పరం రక్షించుకుంటూ ముందుకు తీసుకెళ్లే సంస్కృతి నిర్మించడమే నిజమైన మానవ హక్కుల పోరాటం. ఈ పోరాటం ఒక రోజు పండుగతో ముగిసేది కాదు. అది ప్రజాస్వామ్య శ్వాసలో ప్రతిరోజూ కొనసాగాల్సిన కర్తవ్యమే.

# పేదల సంక్షేమ పథకాల్లో డిజిటలైజేషన్ ప్రభావం

- డిజిటల్ ప్లాట్ఫాంలతో పారదర్శకత పెరుగుదల
- లబ్ధిదారులకు నేరుగా లాభం చేరే వ్యవస్థ
- ప్రజా సేవల్లో సాంకేతికత తీసుకొచ్చిన నూతన మార్పులు

**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశంలో పేదల సంక్షేమ పథకాలు గత మూడు దశాబ్దాలుగా మారుతూ వచ్చినప్పటికీ, డిజిటలైజేషన్ ప్రవేశంతో వాటికి పూర్తిగా కొత్త దిశ లభించింది. ఆధార్ ఆధారిత గుర్తింపు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్, డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి వ్యవస్థలు పేదల కోసం ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం చేస్తూ, అందుబాటు పెంచుతున్నాయి. గతంలో అనేక పథకాలు మధ్యవర్తుల ఆధీనంగా ఉండడంతో లీకేజీలు ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు టెక్నాలజీ ఆ లోపాలను పెద్దమేర తగ్గిస్తూ సంక్షేమ రంగానికి కొత్త శక్తి ఇస్తోంది.

డిజిటల్ పద్ధతులు విస్తరించడంతో లబ్ధిదారుల గుర్తింపు ఖచ్చితమై, నిధులు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు చేరే విధానానికి విపరీతమైన ప్రాధాన్యం పెరిగింది. పింఛన్లు, గృహ వసతులు, రేషన్, రైతు బీమా, చదువుకి ఆర్థిక సహాయం వంటి అనేక పథకాల్లో డిజిటల్ ధృవీకరణ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి రావడంతో పేదల జీవితాల్లో పారదర్శకత మాత్రమే కాదు, ఆర్థిక భద్రత కూడా పెరిగింది. అయితే ఇప్పటికీ డిజిటల్ లిటరసీ లోపం, ఇంటర్నెట్ సమస్యలు వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, గతంతో పోలిస్తే మార్పు వేగం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాలను సాంకేతికత ఆధారంగా అప్డేట్ చేస్తూ, సమయానుగుణంగా సేవల ఫార్మ్లను మార్చడం ప్రజలకు సౌలభ్యాన్ని అందిస్తోంది. లబ్ధిదారులు ఇంటి నుంచి సేవలు పొందగలగడం, అప్లికేషన్లను ఆన్లైన్లో ట్రాక్ చేయగలగడం వంటి అవకాశాలు ప్రభుత్వ – ప్రజల మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా పేదలకు వారి హక్కులపై అవగాహన పెరగడం, పథకాలపై అవినీతి తగ్గడం, ఫిర్యాదు వ్యవస్థ బలపడడం వంటి ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డిజిటల్ డోర్–స్టెప్ సేవలు అభివృద్ధి దిశగా కీలక అడుగుగా మారాయి.

అయితే డిజిటలైజేషన్ అన్నింటికీ సమాధానం కాదనే అభిప్రాయం ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ అందుబాటు, వృద్ధులకు టెక్నాలజీ వినియోగంలో ఉన్న ఇబ్బందులు, ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాలను సాంకేతికత ఆధారంగా అప్డేట్ చేస్తూ, సమయానుగుణంగా సేవల ఫార్మ్లను మార్చడం ప్రజలకు సౌలభ్యాన్ని అందిస్తోంది. లబ్ధిదారులు ఇంటి నుంచి సేవలు పొందగలగడం, అప్లికేషన్లను ఆన్లైన్లో ట్రాక్ చేయగలగడం వంటి అవకాశాలు ప్రభుత్వ – ప్రజల కొన్నిసార్లు ఆధార్ ధృవీకరణలో వచ్చే పొరపాట్లు ఇవి ఇంకా పరిష్కారం కోరుతున్న అంశాలే. అయినప్పటికీ, పేదల సంక్షేమ వ్యవస్థలో డిజిటలైజేషన్ ఒక విప్లవాత్మక మార్పు తెచ్చిందని ఖండించలేం. ఇది సంక్షేమాన్ని ప్రజలకు "సమయానికి %–% సమర్థవంతంగా – నేరుగా" అందించే శక్తిని పెంచి, పాలనలో నూతన ప్రమాణాలు ఏర్పరుస్తోంది. భవిష్యత్తులో ఈ డిజిటల్ వ్యవస్థలు మరింత సమగ్రీకరించబడితే, పేదల సంక్షేమ పథకాలు మరింత నాణ్యమైన సేవలను అందించగలవని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ - కోహ్లీ రెండో స్థానం

**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో టీమిండియా కీలక బ్యాట్స్‌మన్‌లు తమ ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నారు. ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండు స్థానాలు మెరుగుపరుచుకుంటూ రెండో స్థానానికి చేరాడు. ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న రోహిత్ శర్మ తన స్థానాన్ని అటు ఇటు కాకుండా దృఢంగా నిలబెట్టుకున్నాడు. ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు వన్డే బ్యాటింగ్ పట్టికలో అగ్రస్థానాలను ఆక్రమించటం భారత క్రికెట్‌కు మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది. దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో కోహ్లీ రెండు శతకాలు, ఒక అర్ధ శతకంతో మొత్తం మూడు వందల రెండు పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. సిరీస్‌లో చివరి మ్యాచ్‌లో అజేయంగా అరవై ఐదు పరుగులు చేయడంతో కోహ్లీ రేటింగ్ పాయింట్లు భారీగా పెరిగి అగ్రస్థానానికి కేవలం ఎనిమిది పాయింట్ల దూరంలో నిలిచాడు. మరోవైపు రోహిత్ శర్మ మూడు మ్యాచ్‌ల్లో నూట నలభై ఆరు పరుగులు చేసి తన స్థిరత్వాన్ని కొనసాగించాడు. టీమిండియా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలవగా, శ్రేయాస్ అయ్యర్ పదో స్థానానికి జారాడు. కేఎల్ రాహుల్ రెండు స్థానాలు మెరుగుపడి పన్నెండో స్థానంలో నిలిచాడు. బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో యశస్వీ




జైస్వాల్ ఎనిమిదో స్థానంలో, శుభ్‌మన్ గిల్ పదకొండో స్థానంలో, రిషబ్ పంత్ పదమూడో స్థానంలో నిలిచారు. టెస్ట్ బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ వరుసగా పన్నెండో, పదమూడో, పదనాలుగో స్థానాలకు చేరుకున్నారు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్‌లు కూడా తమ ర్యాంకులను మెరుగు పరుచుకోగా, యాషెస్‌లో రెండు మ్యాచ్‌ల్లో పద్దెనిమిది వికెట్లు సంచలనంగా తీసిన ఆస్ట్రేలియా వేగబౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ బౌలింగ్ పట్టికలో మూడో స్థానానికి చేరాడు.

# అండర్-19 కోచ్‌పై ప్లేయర్ల దాడి

**వేద న్యూస్ డెస్క్:**



పుదుచ్చెరిలో అండర్-19 క్రికెట్ జట్టులో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఎంపిక వివాదంపై ముగ్గురు యువ క్రికెటర్లు తమ కోచ్ ఎస్ వెంకటరమణపై దాడి చేయడంతో క్రికెట్ వర్గాల్లో కలకలం రేగింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి ఎంపిక చేయలేదనే ఆగ్రహంతో ప్లేయర్లు బ్యాట్‌తో కోచ్‌పై దాడి చేశారని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో కోచ్ తలపై తీవ్ర గాయాలు కాగా, మొత్తం ఇరవై కుట్లు వేయాల్సి వచ్చింది. భుజం కూడా విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. డిసెంబర్ ఎనిమిదో తేదీ మధ్యాహ్నం సీఏపీ కాంప్లెక్స్ ఇండోర్ నెట్స్ వద్ద ఈ ఘటన జరిగింది. అప్పట్లో కోచ్ వెంకటరమణ ప్రాక్టీస్ పరిశీలిస్తున్న వేళ సీనియర్ క్రికెటర్లు కార్తికేయన్, అరవిందరాజ్, సంతోష్ కుమారన్ అక్కడికి చేరి తీవ్ర వాదనకు దిగారు. ఎంపికపై అసంతృప్తితో ఉన్న ఈ ముగ్గురు ఆటగాళ్లు అకస్మాత్తుగా కోచ్‌పై దాడి చేశారని ఫిర్యాదులో వెల్లడైంది. కోచ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. దాడి చేసిన క్రికెటర్లు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీదార్‌పేట్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు భారతీదశన్ పాండిచ్చెరి క్రికెటర్స్ ఫోరం కార్యదర్శి జీ చంద్రన్ రెచ్చగొట్టడం కారణమని కోచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పుదుచ్చెరి క్రికెట్ అసోసియేషన్ ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. యువ ఆటగాళ్ల నుంచి ఇలాంటి ప్రవర్తన అపూర్వమని, క్రికెట్ విలువలకు విరుద్ధమని అధికారులు తెలిపారు.

# బాలీవుడ్ చిత్రంపై రేణూ దేశాయ్ ప్రశంసల వెల్లువ



**వేద న్యూస్ డెస్క్:**

సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండే రేణూ దేశాయ్, సినీ విషయాలపై పెద్దగా స్పందించని ఆమె, ఈసారి బాలీవుడ్‌లో సంచలనంగా నిలుస్తున్న 'ధురంధర్' చిత్రాన్ని చూసి మంత్రముగ్ధురాలైంది. సినిమా ప్రతి భారతీయుడు తప్పక చూడాల్సిందేనని భావోద్వేగంగా చెప్పింది. దేశభక్తి నేపథ్యంతో నిర్మితమైన ఈ గూఢచారి కథలో రణ్‌వీర్ సింగ్ అద్భుత నటన చిత్రానికి ప్రధాన బలం. 'నాన్న' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న సారా అర్జున్ ఇందులో కథానాయికగా మెప్పించగా, మాధవన్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించారు. విడుదలైన మూడు రోజుల్లోనే ఈ చిత్రం వంద కోట్లు దాటేసి బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమా వీక్షించిన తర్వాత రేణూ దేశాయ్ సోషల్‌మీడియాలో తన అనుభూతిని పంచుకుంది. మన కోసం అహర్నిశలు కష్టపడే సైనికుల జీవితం, వారి త్యాగం, దేశ భద్రత కోసం చేసే పోరాటం ఈ చిత్రం ద్వారా ఎంతో స్పష్టంగా అర్థమవుతుందని ఆమె పేర్కొంది. స్వేచ్ఛగా జీవించే అవకాశం మనకు లభించడం వెనుక సైన్యం చేసే కష్టం ఎంతో గొప్పదని చెప్పింది. దేశం గురించి మాట్లాడే వారు కూడా ఈ సినిమా చూసి కనీసం గౌరవం అయినా నేర్చుకోవాలని రేణూ వ్యాఖ్యానించింది. ఆమె చేసిన ఈ కఠిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీశాయి. 'ఉరి'తో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య ధర్ నిజ సంఘటనల ఆధారంగా 'ధురంధర్'ను తెరకెక్కించాడు. ఇప్పటివరకు సినిమా వసూళ్లు లక్ష పదుల కోట్లు దాటేసి కొత్త రికార్డుల దిశగా పయనిస్తోంది. ప్రముఖులు వరుసగా ప్రశంసలు కురిపిస్తుండగా, రేణూ దేశాయ్ చేసిన స్పందన చిత్రానికి మరింత హైప్ తెచ్చిందని సినీ వర్గాలు అంటున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని రికార్డులు నమోదు చేయడం ఖాయమని విశ్లేషకుల అంచనా

# మమ్ముట్టి 'కళంకావల్'కు కేరళలో జోష్

**- నాలుగు రోజుల్లోనే యాభై కోట్ల దూకుడు**




**వేద న్యూస్ డెస్క్:**

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. డిసెంబర్ 05న విడుదలైన ఈ సినిమా కేవలం నాలుగు రోజుల్లోనే యాభై కోట్ల మార్క్‌ను దాటినట్లు చిత్రబృందం ప్రకటించింది. జితిన్ జోస్ దర్శకత్వంలో రూపొందిన ఈ ఉత్కంఠభరిత కథలో పూర్తిస్థాయి ప్రతినాయకుడిగా కనిపించాడు. సైకో షేడ్స్ ఉన్న పాత్రలో ఆయన నటన ప్రేక్షకులను ముగ్ధులను చేస్తోంది. జైలర్ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న వినాయకన్ ఇందులో కథానాయకుడిగా నటించి మెప్పించాడు. కథ, నేపథ్యం, మమ్ముట్టి నటించిన ఘాటైన పాత్ర - ఇవన్నీ కలిసి సినిమాకు అదనపు బజ్ తీసుకువచ్చాయి. విడుదలైన వారం చివర్లో పెద్ద సినిమాలు బాక్సాఫీస్‌పై లేకపోవడంతో 'కళంకావల్'కు ప్రేక్షకాదరణ మరింత పెరిగిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మమ్ముట్టి కెరీర్‌లో మరో ఘన విజయంగా నిలిచే అవకాశాలు కనిపిస్తూ, రాబోయే రోజుల్లో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఐపీఎల్ - ఐదుగురు దిగ్గజాలకు ముగింపు

**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 కోసం సన్నాహాలు వేగవంతంగా సాగుతున్న వేళ, పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ నుంచి టోర్నీకి దూరమవుతున్నట్టు ప్రకటించారు. డిసెంబర్ 16న అబుదాబిలో జరగబోయే మినీ వేలం ముందే ఈ ఐదుగురు దిగ్గజాల నిర్ణయం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. కొందరు ఇతర లీగ్‌లను ఎంచుకోగా, మరికొందరు రిటైర్మెంట్ తీసుకుని ఐపీఎల్ అధ్యాయానికి స్వస్తి పలికారు. ఇంగ్లండ్ ఆల్ రౌండర్ మోయిన్ అలీ ఈ సీజన్ నుండి ఐపీఎల్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. పాకిస్తాన్ లీగ్‌ను ఎంచుకున్నట్టు వెల్లడించిన ఆయన, కోల్‌కతా తరఫున ఆడిన మ్యాచ్‌లలో నిలకడగా ప్రదర్శించినప్పటికీ, ఈసారి భారత లీగ్‌కు నో చెప్పాడు. ఫాఫ్ డు ప్లెసిస్ కూడా ఇదే బాట పట్టాడు. ఎన్నేళ్లుగా ఐపీఎల్ తనకు అందించిన గుర్తింపుని కృతజ్ఞతగా గుర్తుచేసుకున్న ఫాఫ్, ఇకపై పీఎస్‌ఎల్‌పై దృష్టి పెట్టనున్నట్టు వెల్లడించాడు. చెన్నై, బెంగళూరు, ఢిల్లీ తరఫున అగ్రశ్రేణి ఆటను చూపిన రైట్ హ్యాండర్ నిర్ణయం అభిమానులను కదిలించింది. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ కూడా వేలం జాబితా నుంచి తన పేరు తీసేశాడు. కారణం ప్రకటించకపోయినా, గత రెండేళ్లలో వచ్చిన చేసే కష్టాలు, ఫామ్‌లో వచ్చిన పడిపోవడం ఈ నిర్ణయానికి కారణమని భావిస్తున్నారు. అయినా కూడా ఐపీఎల్‌కు ఇచ్చిన సేవలు అభిమానుల హృదయాలలో చెరిగిపోని గుర్తుల్లా నిలిచేలా చేశాయి. కేకేఆర్ పవర్ ఆటగాడు ఆండ్రీ రస్సెల్ అయితే అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటిం చాడు. ఇకపై




పవర్ కోచ్‌గా కొలకతా కుటుంబంతో కొనసాగనున్నట్టు తెలిపాడు. అనేకసార్లు మ్యాచ్‌లను ఒంటరిగా మార్చిన అతని శక్తి ఐపీఎల్ చరిత్రలో ఎన్నటికీ మరవలేనిది. భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇప్పటికే టోర్నీకి గుడ్‌బై చెప్పాడు. దాదాపు 187 వికెట్లతో ఐపీఎల్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా నిలిచిన అశ్విన్, చెన్నై విజయాల్లో కీలక పాత్ర పోషించిన ప్రతిభావంతుడు. ఐపీఎల్ 2026లో ఈ స్టార్‌ల లోపాన్ని అభిమానులు తప్పక అనుభూతి చెందనున్నారు.

# సైక్ సిద్ధార్థ విడుదల వాయిదా

**- 'అఖండ 2' ప్రభావంతో నిర్ణయం మార్చుకున్న నందు టీమ్**

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటించిన 'సైక్ సిద్ధార్థ' చిత్రం విడుదల తేదీ మారింది. "మీలాంటి యువకుడి కథ" అనే ఉపశీర్షికతో అడల్ట్ కామెడీ శైలిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక వంటి నటులు కూడా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు స్వయంగా నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరిస్తుండటం ఈ చిత్రానికి మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. మొదటగా ఈ సినిమాను డిసెంబర్ 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన చిత్రబృందం, అదే రోజున నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భారీ చిత్రం 'అఖండ 2' రానుండటంతో పెద్ద నిర్ణయం తీసుకుంది. బాలయ్యకు తాము అభిమానులమని, ఆయన చిత్రానికి పూర్తి మద్దతు ఉండాలని భావించిన నేపథ్యంలో 'సైక్ సిద్ధార్థ' విడుదలను వాయిదా వేస్తున్నట్లు టీమ్ ప్రత్యేక వీడియోను విడుదల చేసి తెలియజేసింది. నందు ఈ వీడియోలో మాట్లాడుతూ, "బాలయ్యగారి సినిమా వస్తున్న రోజున మా సినిమా విడుదల చేయడం వల్ల ఇద్దరికీ నష్టం. అందుకే కుటుంబంగా, అభిమానుల్లా ఆయన సినిమాకు జేజేలు పలకాలని అందరం నిర్ణయించుకున్నాం" అని వెల్లడించాడు. నిర్మాతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ప్రేక్షకులకు మంచి అనుభవం అందించటమే తమ లక్ష్యమని తెలిపారు. తాజా నిర్ణయం ప్రకారం, 'సైక్ సిద్ధార్థ' కొత్త విడుదల తేదీ జనవరి 1. నూతన సంవత్సరం





కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ చిత్రం కామెడీ, యువతరం సమస్యలు, సంబంధాలలోని గందరగోళాలను వినూత్నంగా చూపించనుందని టీమ్ చెబుతోంది. ఇటీవల విడుదలైన పాటలు, ట్రైలర్ యూత్‌లో మంచి బజ్‌ను సృష్టించాయి. నూతన సంవత్సర వేళ ప్రేక్షకుల తీర్పుపై సినిమా భవితవ్యం ఆధారపడి ఉండగా, బాలయ్య చిత్రం ప్రభావం లేకుండా సరైన టైమ్‌టి కోసం మారిన ఈ నిర్ణయాన్ని అభిమానులు సోషల్ మీడియాలో స్వాగతిస్తున్నారు.

# వారణాసి గ్లింప్స్‌పై సోషల్ మీడియాలో హంగామా

**వేద న్యూస్ డెస్క్:**

సూపర్ స్టార్ మహేష్ బాబు - ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రపంచస్థాయి సినిమా 'వారణాసి'పై అభిమానుల్లో రోజురోజుకు ఆతృత పెరుగుతోంది. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మాణం సాగుతున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ లెవెల్‌లో ప్రమోట్ చేయాలన్న సంకల్పంతో రాజమౌళి ఇప్పటికే ఎన్నో ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు వైరల్ అయ్యాయి. అమెరికాలోని లాస్ వెగాస్‌లో ఉన్న ప్రపంచ ప్రసిద్ధ స్పియర్ బాల్ భవనంపై "వారణాసి" గ్లింప్స్ ప్రదర్శించారన్న వార్త రగిలిపోయింది. భారీ లైట్ల మధ్య మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు?మాతోనే నెట్టింట మొత్తాన్ని ఆకట్టుకున్నాయి. స్పియర్ బాల్‌పై కనబడిన ఆ ఫోటోలు నిజం కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమేనని నిర్ధారణ అయింది. దీంతో అతి తక్కువ సమయంలో వైరల్ అయిన ఆ ప్రచారం పూర్తిగా తప్పుడు సమాచారమని తెలిసి అభిమానులు కొంత నిరాశ వ్యక్తం చేశారు. అయినా, స్పియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమీ కాదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.




సరైన మొత్తం చెల్లిస్తే ప్రపంచంలోని ప్రముఖ బ్రాండ్‌లు, సినిమాలు అక్కడ తన కంటెంట్‌ను ప్రదర్శిస్తూ వస్తుండటంతో, "వారణాసి" టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రకటన చేయవచ్చని అంచనా. ఇదిలా ఉంటే, చిత్రానికి సంబంధించిన మరో వార్త కూడా హాట్ టాపిక్‌గా మారింది. చిత్రంలో మహేష్ బాబు ఐదు వేర్వేరు అవతారాల్లో కనిపించబోతున్నాడనే ప్రచారం ఊపందుకుంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073